

మహిళల ఉపాధికి ఊతం

- రైతులకు ఆసరాగా నిలిచేందుకు మహిళా సంఘాలకు డ్రోన్లు
- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా అందించేందుకు ప్రతిపాదనలు
- జిల్లాలో 14,964 మహిళా సంఘాలు



జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రైతులకు ఆసరాగా ఉండేందుకు మహిళా సమాఖ్యలకు రాయితీపై డ్రోన్లు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ముందుగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున డీఆర్‌డీఏ నుంచి ప్రతిపాదనలు రూపొందించారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. దీని ద్వారా రైతులకు మేలు చేయడంతో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 18 మండల మహిళా సమాఖ్య సంఘాలుండగా 14,964 స్వయం సహాయక మహిళా సంఘాలున్నాయి. వీటిల్లో 1,73,412 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

● 80 శాతం రాయితీపై...

రసాయన ఎరువులను డ్రోన్‌ల ద్వారా పిచికారి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పలు కంపెనీలు కూడా సహకార సంఘాల ద్వారా డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. రూ.10 లక్షల విలువైన డ్రోన్ యంత్రానికి రూ.8 లక్షలు రాయితీ వర్తిస్తుండగా మిగితా రూ.2 లక్షలు మండల మహిళా సమాఖ్యలు భరించాల్సి ఉంటుంది. డ్రోన్లు మండల మహిళా సమాఖ్యలకు అందిన తర్వాత వాటి నిర్వహణకు ఇద్దరిని నియమించనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చి పంట పొలాల్లో రసాయనాలు పిచికారీ చేయనున్నారు. డ్రోన్లతో వరి, పత్తి, మామిడి, పసుపు తదితర తోటలకు రసాయనాలు పిచికారి చేసేందుకు అవకాశం ఉండగా మరోవైపు కూలీల కొరతను అధిగమించవచ్చని అన్నదాతలు భావిస్తున్నారు. ఇది విజయవంతం అయితే మండలాల వారీగా విస్తరించేందుకు అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

● జిల్లాలో ఐదు యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదన

జిల్లాలోని ఆయా మండలాల్లో ఐదు యూనిట్లను తొలివిడతలో ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతి పాదనలు పంపారు. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మల్లాపూర్ శ్రీకనక సోమేశ్వర మండల సమాఖ్య, వేములవాడ నియోజకవర్గం పరిధిలో కథలాపూర్ అరుణోదయ మండల సమాఖ్య, జగిత్యాల నియోజకవర్గం పరిధిలో రాయికల్ ధన్యలక్ష్మీ మహిళా మండల సమాఖ్య, ధర్మపురి నియోజకవర్గం పరిధిలో గొల్లపల్లి శ్రీ సాయి మహిళా సమాఖ్య, చొప్పదండి నియోజకవర్గం పరిధిలో ఉషోదయ మండల మహిళా సమాఖ్యలను ఎంపిక చేశారు.

● పర్యవేక్షణ పెరిగితేనే సత్ఫలితాలు..

ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పరికరాలపై అధికారుల పర్యవేక్షణ పెరిగినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చని నిపుణులు అంటున్నారు. గతంలో మహిళా సంఘాల ద్వారా

మిగతా 8లో

ఘనంగా మల్లన్న జాతర



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలోని మల్లన్న ఆలయంలో జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో యాదవ సంప్రదాయం ప్రకారం పట్నాలు వేసి పూజలు జరిపారు. యాదవ సంఘ మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయానికి విచ్చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవసంఘ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అడిషనల్ కోర్టు మంజూరు చేయాలి



హైకోర్టు జడ్జికి వినతిపత్రం ఇస్తున్న మెట్‌పల్లి న్యాయవాదులు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లికి జిల్లా అడిషనల్ కోర్టుతో పాటు కోర్టుకు నూతన కాంప్లెక్స్ భవనం మంజూరు చేయాలని మంగళవారం మెట్‌పల్లి బార్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి, జగిత్యాల జిల్లా పోర్టుపోలియో జడ్జి ఈవి వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ పట్టణంలో కోర్టు కాంప్లెక్స్ భవనం తదితర సమస్యలపై జడ్జిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇవ్వగా సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొమిరెడ్డి కరం, విజయ్ అజాద్, అల్లూరి దివాకర్‌రెడ్డి, రాంబాబు, వెంకట నర్సయ్య, ఆనంద్ గౌడ్, అశోక్, శేషు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా కొనసాగించాలని, రైతు భరోసాపై గ్రీవెన్స్ సెల్ జిల్లాలో ఏర్పాటు చేయాలని, ఐదు రోజుల్లో అదనపు వివరాల నమోదు పోర్టల్‌లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను వినియోగించుకుని చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల తర్వాత రేషన్ కార్డుల పంపిణీకి సన్నద్ధం కావాలని అధికారులకు సూచించారు. ప్రజలు పదే పదే రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. మిషన్ భగీరథ, పట్టణాల్లో అమృత్ కింద చేపట్టిన తాగునీటి పథకం, ఇతర తాగునీటి పథకాలకు, ఆస్పత్రులకు, వ్యవసాయ ఫీడర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని, కలెక్టర్‌లు తమ పరిధిలో ఉన్న సబ్ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వ నిర్ణయించిందని, ఇప్పటివరకు మూడు ఎకరాల వరకు రైతులకు ఎకరానికి రూ.12 వేల చొప్పున 63 శాతం పంపిణీ చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీవో రఘువరణ్, ఇన్‌చార్జి డీపీవో మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలం సాతారం గ్రామం నుంచి మెట్‌పల్లి వైపు వస్తున్న రెండు ట్రాక్టర్లను వెంపేట గ్రామ శివారులో ఒకటి, రైల్వే బిడ్జి వద్ద ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని యాజమానులపై, డ్రైవర్లపై మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా సీఐ హెచ్చరించారు.

చోరీకి పాల్పడిన దొంగ అరెస్ట్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 2న చోరికి పాల్పడిన కరీంనగర్ రేకుర్తికి చెందిన తూర్పటి కనకయ్యను పట్టుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడన్నారు. కనకయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం గురించి ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గతంలోనూ కనకయ్య పలు ఆలయాలలో దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

దుబ్బరాజన్న బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎండీ జమీర్

సారంగాపూర్, ఫిబ్రవరి, 18 (ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి సందర్భంగా పెంబట్ల కోనాపూర్ శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి వారి జాతర బ్రహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎండీ జమీర్ తెలిపారు. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎండీ జమీర్ కోరారు. మంగళవారం ఆలయ ఆవరణలో తహసీల్దార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శానిటేషన్, పోలీస్ భద్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 24 గంటలు వైద్య సేవలతో పాటు అంబులెన్స్ ఏర్పాటు, ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

జాతరలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు జగిత్యాల సీఐ కృష్ణరెడ్డి తెలిపారు. భక్తుల ప్రయాణం కోసం ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మిం చిన బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నాయ కులు సీఐ కృష్ణరెడ్డిని కోరారు. జాతరలో ఏసమస్య ఏర్పడినా తమ దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో అనూష అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, డాక్టరు రాధ, ఎస్సై దత్తాద్రి, ఏఈ రాజమల్లయ్య, ఏఈ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు రాంచందర్‌రెడ్డి, కోల శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోట లక్ష్మణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

భీమారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో మంగళవారం సైబర్ క్రైమ్ నేరాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌కువచ్చే లింక్‌లు, మెస్సేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని అన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అపరిచిత వ్యక్తులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వరాదని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

బీర్‌పూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గుట్ట సమీపంలో చెట్ల కింద వంటలు చేసుకొని కుటుంబ సమేతంగా అందరూ కలిసి భోజనం చేశారు. బీర్‌పూర్, ధర్మపురి, సాంగాపూర్, రాయికల్, బుగ్గారం, జగిత్యాల పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో జాతర పరిసర ప్రాంతమంతా కిటకిటలాడింది.

'బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్'



సేవాలాల్ జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బంజారాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బంజారాలకు పోస్టుమెట్రిక్ హాస్టల్ ఏర్పాటుకు రూ.కోటి 10 లక్షల నిధులు కేటాయించారన్నారు. స్థల సమస్య వల్ల మరో స్థలం కేటాయించడం గురించి కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో రూ.50 లక్షలతో బంజారా భవన్ నిర్మాణానికి, సేవాలాల్ జయంతి ఉత్సవాలకు యేటా రూ.10లక్షల నిధులు కేటాయించాలని ప్రభుత్వ కార్యదర్శిని కోరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, చెట్‌పెల్లి సుధాకర్, దశరథ నాయక్, భూక్య నరేందర్, సంతోష్ నాయక్, అరుణ్, ప్రభాకర్, నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో గల సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ హానర్స్ కోర్సు నందు ఖాళీ సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అసోసియేట్ డీన్ సుబ్బిరెడ్డి తెలిపారు. విద్యార్థినిలు బైపీసీ లేదా అగ్రికల్చర్ డిప్లొమా అర్హత సాధించి ఉండాలన్నారు. గ్రామీణ విద్యార్థినిల సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ విద్యార్థినిలు సంవత్సర ఆదాయం 2 లక్షలోపు ఉండాలని అన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్‌లతో పాటు అగ్రిసెట్ ర్యాంక్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతపరిచి హైదరాబాద్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీనందు సమర్పించాలని కోరారు. వివరాలకు 9959247652 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఇటిక్యాల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాయికల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ తెలిపారు. కరీంనగర్ రేకుర్తి కంటి వైద్యులు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేసి, మోతె బిందు ఆపరేషన్ అవసరమైనవారిని గుర్తించి రేకుర్తి కరీంనగర్ కంటి వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం ప్రోగ్రాం చైర్మన్ కొమ్ముల ఆదిరెడ్డిని 9441057050 నంబర్‌లో, కో చైర్మన్ బొడ్డం అంజిరెడ్డిని 9949681986 నంబర్‌లో, కనపర్తి శ్రీనివాస్‌ను 9849366019 నంబర్‌లో, మండలోజు శ్రీనివాస్‌ను 9949325389 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

13 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 13 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ (సీసీఎల్ఏ) సెక్రటరీ మంద మకరంద మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికి బాసర జోన్ - 2 పరిధిలోని నిజామాబాద్, నిర్మల్ తదితర జిల్లాలో పోస్టింగ్ అలాట్‌మెంట్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

నర్సరీల్లో షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేయాలి

● డీఆర్డీవో పీడీ రఘువరన్



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో పీడీ రఘువరన్

మల్లాపూర్, ఫిబ్రవరి, 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని హుస్సేన్‌నగర్, ఓబులాపూర్, ధామరాజ్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. నర్సరీలో పెంచు తున్న మొక్కల వివరాలను కార్యద ర్శులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లను సూచించారు. ధామ్‌రాజ్‌పల్లిలోని ఇందిరమ్మఇండ్ల లబ్ధిదారులు నిర్మాణం చేయడానికి ముగ్గు పోయగా వాటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఏపీవో సతీష్, టీఏ సరిత, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు

● వాగులో దారికి అడ్డంగా కందకం తవ్విన అధికారులు

కథలాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని సిరికొండ, తక్కళ్ళపల్లి, కోరుట్ల మండలంలోని నాగులపేట, సంగెం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్ నేతృత్వంలో మంగళవారం వాగులోకి వెళ్ళే దారికి అడ్డంగా కందకం తవ్వించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు సీసీ మెమెరాలు బిగించాలని అధికార యంత్రాంగం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

భూ ఆక్రమణ కేసులో పోలీసుల కస్టడీకి నిందితులు


సోదాలు నిర్వహించి బయటకు వస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భూ ఆక్రమణ కేసులో అరెస్టై కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు, గణేష్‌నగర్‌కు చెందిన దాసరి సంజీవరెడ్డి, క్రిస్టియన్ కాలనీకి చెందిన మహ్మద్ బషీర్‌ను కోర్టు ఆదేశాలతో మంగళవారం కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు తీవ్రగాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పిక్కల్ల కొమురయ్య ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ సోమవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డాడు. పంటలకు నీరందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ పని చేయకపోవడంతో రైతులు కొమురయ్యను ఆశ్రయించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను విద్యుత్ ఉద్యోగులు చేయవలసి ఉండగా పెగడపల్లిలో ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న కొమురయ్య చేస్తున్నాడు. రైతులు కొమురయ్యను ఆశ్రయించడంతో పెగడపల్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే నాంసానిపల్లికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా కాగా దానికి అతడు ఎల్‌సీ తీసుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కొమురయ్యను కరీంనగర్‌కు అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కొమురయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్దగల మడేలయ్య దేవాలయం వద్ద బండకింద దాచుకొని గంజాయి తాగుతున్న నలుగురు యువకులను మంగళవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన అంకార్ ప్రణీత్(24), అంబేద్కర్‌నగర్‌కు చెందిన గొల్లపెల్లి కార్తికేయన్(19), ఆకునూరి శివాజీ(19), ఆకునూరి మనిదీప్(20) అనే నలుగురు యువకులు కరీంనగర్‌లోని బస్టాండ్‌లో ఓ వ్యక్తి వద్ద రూ. 10000లకు గంజాయి కొనుక్కొని సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద తాగుతుండగా పట్టుకున్నామని తెలిపారు. వీరి వద్ద 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. యువత గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయితో తయారుచేసిన పదార్థాలను కొనుగోలుచేసినా, రవాణా చేసినా, అమ్మినా, తాగినా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు


గాయపడిన సురేష్

కోనరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నిమ్మపల్లి గ్రామానికి చెందిన మల్యాల సురేష్ ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా నిమ్మపల్లి గ్రామ శివారులో వైన్స్ దగ్గర ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ఉన్న సురేష్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఇద్దరినీ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రవాణాశాఖ కార్యాలయంలో

వాహన యజమాని వీరంగం

- విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఓ వాహన యజమాని దాడిలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో రవాణాశాఖ అధికారులు తనిఖీ చేస్తుండగా ఫ్లైయాష్ ఓవర్‌లోడ్‌తో వెళుతున్న లారీని ఆపి కేసు నమోదుచేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ విషయమై రవాణాశాఖ కార్యాలయానికి వచ్చిన వాహన యజమాని నాగరాజు ఎంవీఐతో వాగ్వాదానికి దిగాడు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై వెంటనే జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాహన యజమానిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు. మరోవైపు తనపైనే దాడిచేశారని, డబ్బులు డిమాండ్ చేశారని వాహన యజమాని నాగరాజు ఆరోపించడం కొసమెరుపు.

అందని దూర విద్య

యూజీసీ కొత్త నిబంధనలు



- నిలిచిపోయిన ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాల సేవలు
- ఉమ్మడి జిల్లాలో 21 కేంద్రాలు
- మూడున్నరేళ్లుగా సాగని ఉన్నత చదువులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా ఎంతో మంది పేద విద్యార్థులకు, మహిళలకు, చిన్నాచితక పార్ట్ టైమ్ జాబ్స్ చేసుకునే ఉద్యోగులకు ఉన్నత విద్య అందించిన కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ దూరవిద్య కేంద్రం సేవలు దూరమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుమారు 21 ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాల సేవలకు మూడేన్నరేళ్ళుగా యూజీసీ నిబంధనలు అడ్డుకట్ట వేశాయి. దీంతో పేద వారికి ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారడంతో పాటు ఆయా సెంటర్లలో పని చేస్తున్న దాదాపు 500మందికి పైగా కౌన్సిలర్లు, 21మంది సిబ్బంది ఉపాధి కోల్పోయారు.



యూజీసీ నిబంధనలతో పేదలకు ఉన్నత విద్య దూరం...

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన నిబంధనలలో భాగంగా యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లోనే డిస్టెన్స్ కోర్సులు నిర్వహించాలని జీవో తీసుకువచ్చింది. ఈ జీవోతో ఉన్నత విద్య అభ్యసించాలనే కల పేద విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. గతంలో కాకతీయ యూనివర్సిటీ ఉమ్మడి జిల్లాలలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ పరిధిలో ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు శాతవాహన యూనివర్సిటీ వచ్చినప్పటికి డిస్టెన్స్ కోర్సులు కేయూ పరిధి లోనే కొనసాగాయి. ఈ క్రమంలో యూజీసీ తీసుకువచ్చిన నిబంధనలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు అధ్యయన కేంద్రాలలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

దూరవిద్యతో ఉన్నతస్థాయిలో....

రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో వివిధ కారణాలతో చదువు మధ్యలోనే ఆపేసిన వేల మంది విద్యార్థులకు కేయూ దూరవిద్య అధ్యయన కేంద్రం ద్వారా ఉన్నత విద్యకు దోహదపడింది. 26 ఏళ్ళుగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో కేయూ దూర విద్య అధ్యయన కేంద్రం ద్వారా ఎంతో మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు.

దూరంగా వెళ్లి విద్యనభ్యసించాలి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న స్టడీ సెంటర్లలో విద్యను అభ్యసించాలంటే ప్రస్తుతం 50 నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని కేయూ పరిధిలో నడుస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ మూడు జిల్లాల్లోని దూర విద్య అధ్యయన కేంద్రాలకు వెళ్ళాల్సి వస్తుంది. పరీక్షలు కూడా దూరంగా ఉన్న స్టడీ సెంటర్లకు వెళ్ళి రాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

ఖని అధ్యయన కేంద్రంలోనే వేల మంది విద్యార్థులు...

గోదావరిఖని అధ్యయన కేంద్రంలోనే వేల మంది విద్యార్థులు అభ్యసించేవారు. మంచిర్యాల, చెన్నూర్‌తో పాటు గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం, ఎన్‌టీపీసీ, ఉమ్మడి రామగుండం మండలంలోని విద్యార్థులు ఉన్నత విద్యను సుమారు 3వేల మంది పైగా విద్యార్థులు యేటా విద్యను అభ్యసించే వారు. అధ్యయన కేంద్రం లేకపోవడం చాలా మంది ఉన్నత విద్యకు దూరంగా ఉండాల్సి వస్తుంది.

శాతవాహనలో డిస్టెన్స్ ఇప్పట్లో కష్టమే...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శాతవాహన యూనివర్సిటీలో డిస్టెన్స్ విద్య ప్రారంభం కావడానికి ఇప్పట్లో అవకాశం లేదు. దీంతో పాత పద్ధతిలో కొనసాగిన కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాలను కొనసాగించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయంలో మూడున్నరేళ్ళుగా అధ్యయన కేంద్రాలను కొనసాగించాలని కౌన్సిలర్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పలు స్వచ్ఛంద సంఘాలు డిమాండ్ చేయడంతో పాటు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

అనుమతి వస్తే కొనసాగించేందుకు అవకాశం

రామచందర్, రిజిస్ట్రార్, కాకతీయ యూనివర్సిటీ



యూనివర్సిటీ పరిధిలోనే డిస్టెన్స్ కోర్సులను కొనసాగించాలని యూజీసీ స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దూరవిద్య కేంద్రాలను నిలిపివేశాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిస్టెన్స్ కోర్సులు లేనందున ఉన్నత విద్యామండలి, యూజీసీ నుంచి ప్రత్యేక అనుమతులు వస్తే కొనసాగించడానికి అవకాశం ఉంటుంది.

అధ్యయన కేంద్రాన్ని కొనసాగేందుకు కృషి

రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే, రామగుండం



దూరవిద్య కేంద్రం సేవలు నిలిచిపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం నా దృష్టికి రాగానే కెయూ ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాన్ని తిరిగి పాతపద్ధతిలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రభుత్వానికి అప్పీల్ చేశాను. దూరవిద్యా కేంద్రాన్ని కొనసాగేలా కృషి చేస్తాను.

ఎంఈడీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబరు 2024లో నిర్వహించిన ఎంఈడీ ఫలితాలను విడుదల చేసినట్టు యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ ఫలితాలు యూనివర్సిటీ వెబ్ సైట్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నా రు. మరిన్ని వివరాల కోసం www.satavahana.ac.in సంప్రదించాలని సూచించారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ పరీక్షల ప్రణాళికను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న చోటు చేసుకున్న గొడవకు సంబంధించి వావిలాలపల్లికి చెందిన ఆవుల మధుకర్, రజిత, సుధాకర్ పై త్రీటౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఆవుల మధుకర్, రజిత, సుధాకర్ కులం పేరుతో దూషించారని బాధితుడు సందెబోయిన రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాదాస్పదమవుతున్న విగ్రహాల తొలగింపు

- అటవీశాఖ అధికారులకు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం


అటవీశాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అటవీశాఖ అధికారులకు, అక్కడి ప్రజలకు విగ్రహాల తొలగింపు అంశం వివాదాస్పదమవుతోంది. బంజేరు గ్రామంలో సోమవారం సేవాలాల్ మహారాజ్ రాళ్ల విగ్రహాన్ని తొలగించి పందిరిని ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై మండిపడుతూ మంగళవా రం గిరిజనులు రాళ్లతో విగ్రహాన్ని ఏర్పాటు చేసి పందిరి వేశారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ రేంజ్ అధికారి హరిప్రసాద్, సెక్షన్ అధికారి భూలక్ష్మి, బీట్ అధికారి కిరణ్‌తో గిరిజనులు వాగ్వాదానికి దిగారు. ఏడాది నుంచి ఉన్న సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ అటవీ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటవీ భూములను ఎవరూ ఆక్రమించవద్దని గిరిజనులకు సూచించారు. గర్జనపల్లి గ్రామంలోని నీలగిరి తోట అటవీ ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి విగ్రహం వెలిసిందంటూ గ్రామస్థులు మంగళవారం పూజలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, గర్జనపల్లి ఎఫ్ఎస్‌వో అయూబ్‌ఖాన్, బీట్ అధికారులు వేణు, లావణ్య, పోలీసులు అక్కడికి చేరుకొని అటవీప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయరాదన్నారు. అక్కడే పూజలు చేస్తున్న మహిళలను పోలీసులు అక్కడినుంచి పంపించేశారు. అటవీ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేయొద్దని వారికి సూచించారు. కొద్దిసేపు అటవీశాఖ అధికారులకు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. వెలిసిన విగ్రహాన్ని ఎవరు తొలగించినా ఊరుకోబోమని గ్రామస్థులు హెచ్చరించారు. రెండు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

లంబాడిపల్లిలో హైనా దాడి.. గేదె, దూడ మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఆది శ్రీకాంత్ అనే రైతుకు చెందిన గేదె, దూడ మృతి చెందాయి. బాధిత రైతు మాట్లాడుతు తన కొట్టం వద్ద గేదె, దూడను కట్టి వేసి ఇంటికి వెళ్లనన్నాడు. మంగళవా రం ఉదయం వచ్చే సరికి గేదె, దూడలు మృతి చెంది ఉన్నాయని వాటిపై హైనా దాడి చేసిన గుర్తులు ఉన్నాయని తెలిపాడు. పాడి గేదె విలువ దాదాపు 90 వేలు, దూడ విలువ 9 వేల వరకు ఉంటుందన్నారు. దీనిపై రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి సహాయం అందించాలని వేడుకున్నాడు.

ఇసుక డంప్ సీజ్

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని కస్బెకట్కూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌లను మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి రాత్రిపూట స్మగ్లర్లు ఇసుకను అక్రమ రవాణా చేసి గ్రామశివారులో డంప్ చేశారని ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన తహసీల్దార్ జయంత్‌కుమార్ సిబ్బంది, పోలీసులతో కలిసి కస్బెకట్కూర్ శివారులో ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు.

ఆలయ మెట్లను ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాల గ్రామశివారు మడలేశ్వరస్వామి ఆలయమెట్లను ధ్వంసం చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన రామిండ్ల దేవదానం, అరేటి సంతు, అరేటి ఎల్లయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలో గ్రామపంచాయతీతో పాటు అన్ని కుల సంఘాల తీర్మానం మేరకు 2019లో ఆలయ నిర్మాణానికి 14 గుంటల స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. ఆ స్థలంలో రజక సంఘం సభ్యులు మడలేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారని చెప్పారు. కొంత కాలంగా దేవదానం, సంతు, ఎల్లయ్యలు ఆ స్థలం తమకు చెందినదని పేర్కొంటూ తరచు గొడవకు దిగుతుండడంతో పాటు ఈనెల 18న గుడి మెట్లను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ధర్మారం సతీష్ ఫిర్యాదుతో దేవదానం, సంతు, ఎల్లయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఐదు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం..

- ఈనెల 20, 21 తేదీల్లో

ఆర్‌ఎస్‌యూ పూర్వ విద్యార్థుల సభలు



పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాడికల్స్ అనే పదం ఐదు దశాబ్దాల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతీ ఊరిలో వినిపించిన మాట. ఐదు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న రాడికల్ విద్యార్థి సంఘం(ఆర్‌ఎస్‌యూ) ప్రభావంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది ఆ సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. విద్యను వదిలేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు మావోయిస్టు పార్టీ(నాటి పీపుల్స్‌వార్)లో చేరి గ్రామాల బాట పట్టారు. పనిచేస్తున్నది పీపుల్స్‌వార్ పార్టీలో అయినా దాని అనుబంధ సంస్థ ఆర్‌ఎస్‌యూ కార్యకర్తలుగానే గుర్తింపు పొందారు. పీపుల్స్‌వార్ పోరాటాలు ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నో జ్ఞాపకాలను, గాయాలను మిగిల్చింది. యాభై ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఆర్‌ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)లో ఉమ్మడి జిల్లా నుంచి ఎంతో మంది క్రియాశీల సభ్యులుగా పనిచేశారు. అనంతరం వారి పోరాటంలో భాగంగా మావోయిస్టులో చేరారు. విద్యాలయాల నుంచి పల్లెలకు, ప్రభుత్వం నుంచి నిర్బంధం పెరగడంతో అజ్ఞాతంలోకి వెళ్లి అడవి బాట పట్టారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన ఎంతో మంది నాయకులు మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేశారు. మావోయిస్టు కార్యకలాపాలు రాష్ట్రంలో వరంగల్ తర్వాత ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉండేవి. రాష్ట్ర, కేంద్రస్థాయి నాయకులు సైతం ఇక్కడి వారే ఉండేవారు. ఉమ్మడి కరీంనగర్ నుంచి పీపుల్స్ వార్ ఉద్యమాన్ని విస్తరించే క్రమంలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు తరలివెళ్లారు. పోలీసుల నుంచి నిర్బంధం పెరగడంతో కొందరు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. పలువురు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఈ క్రమంలో ఈనెల 20, 21 తేదీల్లో ఆర్ఎస్‌యూ ప్రస్తానం పేరిట హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విద్యార్థుల సభలు జరగనున్నాయి. ఈ సభలకు పూర్వ ఆర్‌ఎస్‌యూ విద్యార్థులు పాల్గొన నున్నారు.

- **అసువులు బాసిన అగ్రనాయకులు**

మావోయిస్టు పార్టీలో ఉన్న అగ్రనాయకులు అసువులు బాసారు. జగిత్యాల జైత్రయాత్ర ద్వారా ఉద్యమాన్ని ఉర్రూతలూగించారు. నాటి అగ్రనాయకులు బండ గణపతి (ముప్పాల లక్ష్మణరావు), బయ్యపు దేవేందర్‌రెడ్డి(దేవన్న), దగ్గురాజలింగు (సాగర్), మీసాల రాజిరెడ్డి, నల్ల ఆదిరెడ్డి ఆధ్వర్యంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్, రామయ్యపల్లె రమణరెడ్డి, తుంగాని రాజన్న, బుర్ర చిన్నన్న(మాధవ్), రామన్న, గూడెం ప్రసాద్, వడ్కాపూర్ చంద్రమౌళి, పుల్లూరి ప్రసాదరావు(చంద్రన్న), ఆవుల రాజమౌళి ద్వితీయ శ్రేణి నాయకత్వంలో బుర్ర రాజమల్లు, వేగోలపు రాజేందర్, రామోజుల శంకరయ్యపంతులు (సిద్దిపేట చంద్రన్న), బుర్ర సమ్మన్న(దేవన్న), వసంత, శివాజీ తదితరులు మరణించారు.

- **ఉద్యమంపై నీలినీడలు**

మావోయిస్టుల అణచివేత క్రమంలో దేవన్న నాయకత్వం నుంచి అరికిల్ల శంకర్(లింగన్న), దొమ్మటి అర్జయ్య(నాగరాజు), నిర్మలక్క, పద్మక్కలు ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. బోడగుండ సత్తయ్య(భూమన్న), రెడ్డిరాజుల రాజయ్య, దొమ్మటి అర్జయ్యలు లొంగిపోవడం, బయ్యపు సమ్మిరెడ్డి ఉద్యమాన్ని టార్గెట్ చేయడం, కత్తుల సమ్మయ్య, జడల నాగరాజులు ఉద్యమనేతలు కుటుంబాలను టార్గెట్ చేయడం వెరసి ఇక్కడ నీలినీడలు నెలకొన్నాయి.

ప్రస్తుతం ఉద్యమంలో పెద్దపల్లి డివిజన్ నుంచి కేవలం పుల్లూరి ప్రసాద్‌రావు, వేణు, కంకణాల రాజిరెడ్డి మొదలగు ఐదుగురు మాత్రమే ఉద్యమంలో కొనసాగుతున్నారు.

పీపుల్స్‌వార్ చేపట్టిన ఆనాటి పోరాటాలు ఆపార్టీకి, ఈప్రాంత ప్రజలకు తీపి, చేదు కలయికల జ్ఞాపకంగా మిగిలిందని చెప్పవచ్చు. ఈ క్రమంలో జరిగే 50ఏళ్ల ఆర్‌ఎస్‌యూ ప్రస్థానంలో ఉద్యమ చరిత్రను గుర్తు చేసుకోనున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు ధర్మపురి శ్రీనివాస్ అరెస్టు చూపుతున్న బసంత్‌నగర్ పోలీసులు

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జీడీనగర్‌లో శివరాత్రి పోషమ్మ(65)ను మద్యం మత్తులో కర్రతో కొట్టిచంపిన కేసులో నిందితుడు ధర్మపురి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్ వివరాలు వెల్లడించారు. పోషమ్మ భర్త 20 సంవత్సరాల క్రితం చనిపోయాడు. కొడుకు రామగుండంలో ఉండగా పోషమ్మ జీడీనగర్‌లో ఉంటోంది. కేశోరాం సిమెంటు కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్న ధర్మపురి శ్రీనివాస్ మద్యానికి బానిస కావడంతో అతడి భార్య తన పుట్టింట్లో ఉంటోంది. ఒంటరిగా ఉంటున్న శ్రీనివాస్ ఇంట్లో పోషమ్మ పనిచేస్తుందని, ఇద్దరూ సహజీవనం చేసేవారు. బీసీ కాలనీ నుంచి జీడీనగర్‌కు వెళ్లి గుడుంబా తాగేవారు. కొన్ని రోజులుగా పోషమ్మ మరో వ్యక్తి పర్వతం కిష్టయ్యతో సన్నిహితంగా ఉండడం చూసిన శ్రీనివాస్ ఆమెను నిలదీశాడు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో శ్రీనివాస్ పోషమ్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. 9వ తేదీన ఇద్దరూ కలిసి జీడీనగర్ ప్రాంతానికి గుడుంబా తాగడానికి వెళ్లి తిరిగి వస్తుండగా సాయంత్రం ఆరు గంటల సమయంలో శ్మశానవాటిక వద్దకు రాగానే పోషమ్మతో గొడవ పెట్టుకొని కర్రతో తలపై కొట్టగా పోషమ్మ కిందపడిపోయింది. ఆమె చనిపోయిందని నిర్ధారించుకొని శ్మశానంలోకి తీసుకువెళ్లి అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. అనంతరం ఇంటికి వెళ్లి జ్వరం వచ్చిందని ఇంట్లోనే ఉన్నాడు. శ్మశాన వాటికలో సగం కాలిపోయిన స్థితిలో శుక్రవారం మృతదేహం లభించగా మృతురాలి కొడుకు శివరాత్రి అంజి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీనివాస్‌పై అనుమానంతో విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ శివకుమార్, సురేష్, శ్రీనివాస్‌ను ఎస్ఐ అభినందించారు.

మహాశివరాత్రి జాతరకు రండి..

సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన విప్ ఆది

రాజన్న ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా..



సీఎం రేవంత్‌రెడ్డికి మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 26వ తేదిన నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆది శ్రీనివాస మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేయగా, ఆలయ అర్చకులు రాజన్న ప్రసాదం అందజేసి వేదోక్త ఆశీర్వచనాన్ని గావించారు. అనంతరం మహాశివరాత్రి జాతర వేడుకలకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలకు, ఎమ్మెల్యేలకు మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ఎక్కడి వరకు వచ్చాయని ప్రశ్నించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. గత ప్రభుత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగిందని, అలా చేయకుండా పనులను వేగవంతం చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా వేములవాడ రాజన్న భక్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులకు భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు జారీచేశారు.

మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాటు చేయాలి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. భక్తులకు శీఘ్రదర్శనం క్యూలైన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, చలువ పందిళ్ల తదితర ఏర్పాట్లు ముమ్మరం చేయాలని సంబందిత అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అర్చకులు చంద్రగిరి శరత్, గొపన్నగారి చందు, మామిడిపల్లి శరత్, కంబల్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

ఆహ్వానపత్రిక విడుదల

ఒక్క రోజు ముందే స్వామివారికి ప్రభుత్వ పట్టువస్త్రాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను, వాల్‌పోస్టర్స్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి విడుదల చేశారు. రాజన్న ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27వ తేది వరకు మూడు రోజులు మహాశివరాత్రి వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా పనులు వేగవంతంగా చేపడుతున్నారు. 25 ఫిబ్రవరి మంగళవారం రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలను, రాత్రి 7.30 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీతిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీస్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

రాత్రి 9 గంటల కు నిశీపూజ అనంతరం భక్తుల సౌకర్యార్థం లఘు దర్శనం, కోడె మొక్కుబడిని కొనసాగించనున్నట్లు తెలిపారు. కాగా, ఫిబ్రవరి 26 బుధవారం మహాశివరాత్రి పర్వదినం రోజున ఉదయ త్పూర్వం 1.30 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం 1.30 నుంచి 2.30 వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 గంటల వరకు ఆల య శుద్ధి, మంగళవాయిద్యాలు, 3.40 నుంచి 4.23 గంటల వరకు సుప్రభాత సేవ, 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ అనువంశిక అర్చకుల దర్శనము, సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 27 గురువారం ఉదయం సుప్రభాతం, ప్రాతఃకాల పూజ అనంతరం భక్తుల మొక్కులకు ఆర్జిత సేవలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్లు..



వాల్‌పోస్టర్‌లను అతికిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఈవో వినోద్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ప్రాంతాల్లో మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్‌లను అతికించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మహాశివరాత్రికి మూడు రోజుల పాటు నిర్వహించే పూజల వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అతికించాలని ఆలయ సిబ్బందిని ఏర్పాటుచేశారు. సిబ్బంది వెంటనే ఆయా ప్రాంతాలకు వేర్వేరుగా వెళ్లి వాల్‌పోస్టర్లును అతికించారు.

కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం



- పట్టభద్రుల ఎమ్మెల్సీపై గురి
- సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని ప్రయత్నాలు
- గ్రామస్థాయి నేతలకు బాధ్యతల అప్పగింత
- శ్రేణులతో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉండడమే కాకుండా సిట్టింగ్ స్థానం కావడంతో దానిని తిరిగి కైవసం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయడానికి పలువురు ఆసక్తి చూపించినా ఆ పార్టీ అధిష్టానవర్గం చివరకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఆరుగురు ఎంపీలు, 42 మంది ఎమ్మెల్యేలు ఉండగా అందులో కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలే అధికంగా ఉన్నారు. 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్నారు.

బీజేపీకి చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు కూడా ఈ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఈ పరిధిలో 12 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉన్నా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని పోటీలో నిలుపలేదు. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా ఈ స్థానంపై కన్నేసి గెలుపుకోసం ప్రయత్నాలు చేస్తున్నది. 2019 లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 17 మంది పోటీలో ఉండగా మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి 56,698 ఓట్లను సాధించి తొలి రౌండ్ లెక్కింపులోనే విజయం సాధించారు. 1,15,458 ఓట్లు పోల్ కాగా బీఆర్ఎస్‌కు చెందిన చంద్రశేఖర్‌గౌడ్‌కు 17,268, బీజేపీకి చెందిన సుగుణాకర్‌రావుకు 15,077, యువతెలంగాణ పార్టీకి చెందిన రాణి రుద్రమకు 5,192 ఓట్లు వచ్చాయి. 9,932 ఓట్లు చెల్లకుండా పోయాయి. అయితే ఈసారి ఈ నియోజకవర్గంపై దృష్టిసారించిన అభ్యర్థులు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఓటర్ల నమోదును సీరియస్‌గా తీసుకున్నారు. పోటాపోటీగా పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రయత్నాలు చేయడంతో నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు నమోదయ్యాయి. వీటిలో 45శాతం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి.

ఈ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,60,260 ఓట్లు ఉండడంతో అన్ని రాజకీయపార్టీలు కరీంనగర్ కేంద్రంగా చేసుకొని ప్రచారం కొనసాగిస్తున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ తమతమ నియోజకవర్గాల్లోనే కాకుండా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి ఎమ్మెల్యేలను, ఇతర ప్రజాప్రతినిధులను, పార్టీ నేతలను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేసి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ఇద్దరు ఎంపీలతో పాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా అభ్యర్థి విజయం కోసం కృషిచేస్తున్నారు. అధికార పార్టీ అయి ఉండి సిట్టింగ్ స్థానంలో ఓడిపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం పడుతుందని 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉండడంతో ఇక్కడి విజయం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఊపును ఇస్తుందని భావిస్తున్నారు.

అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. పోలింగ్ బూత్‌లవారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇంచార్జిని నియమించడంతోపాటు ప్రతి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యున్ని ఏర్పాటు చేసి ఆయన ద్వారానే ఓటర్లను కలిసే కార్యక్రమం చేపట్టాలని, ఓటర్లను మెప్పించి ఓటింగ్‌కు తీసుకవచ్చే బాధ్యతను ఆయా ఓటర్లు ఉన్న గ్రామ కాంగ్రెస్ నాయకులకు అప్పగించేందుకు పార్టీ నేతలు, అభ్యర్థి జాబితాను తయారు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఈనెల 27న పోలింగ్ జరుగునుండగా ఈవారం రోజుల వ్యవధిలో ఓటర్లను రెండుసార్లు అయినా కలిసి సానుకూల ఓటింగ్ జరిగేలా చూసుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమతమ జిల్లాల పరిధిలో వీడియో కాన్ఫరెన్సు ఏర్పాటు చేసి శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీకి వివిధ విభాగాలు చురుకుగా పనిచేసే అవకాశాలుండడంతో అదే స్థాయిలో ప్రయత్నాలు లేని పక్షంలో సానుకూల ఫలితాలను సాధించలేమని భావిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక కమిటీలపై ప్రత్యేక బాధ్యతలు ఉంచుతూ గెలుపు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.

ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు



- రాష్ట్రంలో తొలి రెండు స్థానాల్లో జమ్మికుంట, హుజూరాబాద్‌లకు చోటు
- 11 స్థానాల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు స్థానం
- ఈనెల 18వ తేదీ వరకు కోరుట్లకు ఐదో స్థానం, మెట్‌పల్లికి తొమ్మిదో ర్యాంకు

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆస్తి పన్ను వసూళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి. తొలి పదకొండు స్థానాల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు చోటు దక్కడం విశేషం. మున్సిపల్ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రంలో ఆస్తిపన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లా పరిధిలోని జమ్మికుంట మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలవగా హుజూరాబాద్ ద్వితీయ స్థానంలో ఉంది. తొలి పదకొండు స్థానాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన సిరిసిల్ల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలు చోటు సంపాదించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు మార్చి నెలాఖరులోగా వంద శాతం లక్ష్యం నెరవేర్చే దిశగా మున్సిపాలిటీలు ముందుకు వెళ్తున్నాయి.

జమ్మికుంటలో 83.49 శాతం వసూళ్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మున్సిపాలిటీ 83.49 శాతం ఆస్తి పన్ను వసూలు చేసి రాష్ట్రంలో తొలిస్థానాన్ని కైవసం చేసుకుంది. జమ్మికుంట మున్సిపాలిటీలో 12,603 గృహాలుండగా రూ.3.50 కోట్ల లక్ష్యానికిగాను రూ.2.63 కోట్లు వసూలు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. 80 శాతం పన్ను వసూలు చేసి హుజూరాబాద్ మున్సిపాలిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది. హుజూరాబాద్ మున్సిపాలిటీలో రూ.2.65 కోట్ల లక్ష్యానికి గాను రూ.2.12 కోట్లు వసూలు అయ్యాయి. సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,483 గృహాలుండగా రూ.6.30 కోట్ల లక్ష్యానికిగాను రూ.4.70 కోట్లు వసూలు చేసి 74.60 శాతం సాధించి నాల్గవ స్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మున్సిపాలిటీలో 19,182 గృహాలుండగా రూ.5.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.64 కోట్లు వసూలు చేసి 72.08 శాతం సాధించి ఐదో స్థానం సంపాదించింది.

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 13,476 గృహాలుండగా రూ.3.95 కోట్ల లక్ష్యానికిగాను రూ.2.64 కోట్లు వసూలు చేసి 66.84 శాతం సాధించి తొమ్మిదవ స్థానంలో, రాయికల్ మున్సిపాలిటీలో 5,367 గృహాలుండగా రూ.1.32 కోట్ల లక్ష్యానికి గాను రూ.86లక్షలు వసూలు చేసి 65.15 శాతం సాధించి పదకొండో స్థానంలో నిలిచింది. జగిత్యాల మున్సిపాలిటీలో 27,186 గృహాలుండగా రూ.13.42 కోట్ల లక్ష్యానికిగాను రూ.6.15 కోట్లు వసూలు చేసి 45.83 శాతం సాధించి 87వ స్థానంలో, ధర్మపురి మున్సిపాలిటీలో 4,629 గృహాలుండగా రూ. 1.34 కోట్ల లక్ష్యానికి గాను రూ.61లక్షలు వసూలు చేసి 45.52 శాతం సాధించి 89వ స్థానంలో నిలిచింది.





జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి



రిశ్వంత్ (ఫైల్)

రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థి పి.రిశ్వంత్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 16వ తేదీన జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో జరిగిన జిల్లా కబడ్డీ అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో రిశ్వంత్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారా బాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూని యర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఏపీపీసీ చైర్మన్ అంజలి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ ఉద్యోగులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కరీంనగర్-2 డిపోలో శిక్షణ తరగతులను ఆర్ఎం బి రాజు, డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ ప్రారంభించారు. కరీంనగర్-1 డిపోలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌లు వి మల్లయ్య, విజయమాధురి, సూపర్‌వైజర్లు హిమబిందు, వీరస్వామి, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

భూమి పట్టా చేయిస్తానని రూ. 31.50లక్షలు టోకరా



బాధితుడు రాజమల్లయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన పురోహితుడు వైరాగ్యపు రాజమల్లయ్యకు ఎకరం భూమి పట్టా చేపిస్తానని, ఎస్సారెస్పీ భూమి పరిహారం కింద రూ. 96 లక్షలు ఇప్పిస్తానని రూ. 31.50 లక్షలు ఓ వ్యక్తి టోకరా వేసిన సంఘటన వెలుగు చూసింది. శంకరపట్నం మండలం కేశవపట్నంలో మంగళవారం బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్య విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య శంకరపట్నం మండలం తాడికల్‌లో నివాసం ఉంటున్నాడు. 2023 సంవత్సరంలో ఊటూరులో మాచర్ల రాజయ్య తల్లి దిశ దినకర్మకు వెళ్లిన పురోహితుడు రాజమల్లయ్యతో మాచర్లరాజయ్యకు పరిచయం ఏర్పడింది.

ఈ క్రమంలో రెవెన్యూ కార్యాలయాల్లో మంచి సంబంధాలు ఉన్నాయని, ఏ పనైనా చేయగలుగుతానని బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్యను మాచర్ల రాజయ్య నమ్మించాడు. తనకు ఏడెకరాల భూమి ఉందని, అందులో ఆరెకరాల భూమి పట్టా అవ్వగా ఒక ఎకరం భూమి పట్టా కాలేదని బాధితుడు మాచర్ల రాజయ్యకు తెలిపారు. ఇదే అదునుగా మాచర్ల రాజయ్య బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్యతో మాట్లాడి ఎకరా భూమి పట్టా చేయిస్తానని లక్ష రూపాయలు ఇవ్వాలని సూచించడంతో ఫోన్ పే ద్వారా లక్ష రూపాయలు మాచర్ల రాజయ్యకు అప్ప చెప్పి నట్లు బాధితుడు తెలిపారు. కాగా ఒక ఎకరం పట్టాతో పాటు ఎస్సారెస్పీ కాలువలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, మరికొంత డబ్బులు అప్ప చెప్పితే రూ. 96లక్షలు పరిహారం ఇప్పిస్తానని నమ్మ బలికాడన్నారు. దీంతో విడతల వారీగా రాజయ్యకు రూ. 31.50లక్షల వరకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు అప్పజెప్పానన్నాను.

పరిహారం రాకపోవడంతో అనుమానంతో జిల్లా కలెక్టరేట్‌కి వెళ్లి వివరాలు తెలుసు కున్నానని ప్రభుత్వం ఎవరికి కూడా పరిహారం ఇవ్వలేదని అధికారులు తెలిపారన్నారు. దీంతో మోసపోయామని గ్రహించినట్లు వైరాగ్యపు రాజమల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలుమార్లు రాజయ్య ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరడంతో అధికారికి డబ్బులు ఇచ్చానని తెలపడంతో వేచి చూశానన్నారు. అయినా భూమి పట్టా చేయకుండా, పరిహారం ఇప్పించకుండా పరి హారం వచ్చినట్లు ఫేక్ సర్టిఫికెట్లు అందించాడని పేర్కొన్నా రు. మాచర్ల రాజయ్యపై పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తన వద్ద వసూలు చేసిన రూ. 31.50లక్షలు ఇప్పించాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్య తెలిపారు.

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో నిరీక్షించారు. తెల్లవారు జామున భక్తులు మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మండపంలో అమ్మవారికి పట్నాలు వేసి, నూతన వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. బద్దిపోచమ్మకు నైవేద్యాన్ని పెట్టి కల్లుసాక పోస్తూ పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల తాకిడితో ఈవో వినోద్‌రెడ్డి సంబందిత ఉద్యోగులను అప్రమత్తం చేశారు.





బోనాలతో క్యూలో భక్తులు

టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థికి బీసీ సంఘాల మద్దతు



టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిమల్క కొమురయ్యకు మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సీమైనార్టీలు రాజకీయాలకతీతంగా బీసీ నాయకుడు మల్క కొమురయ్యను గెలపించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య మాట్లాడుతూ పీఆర్‌టీయూను నమ్మే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తానన్నారు. తనకు మద్ధతు ప్రకటించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్సీఎస్టీయూఎస్, టీటీయూ మద్దతు

టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు ఉపాధ్యాయ సంఘాలు మద్ధతు ప్రకటించాయి. తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబులు సంయుక్త ప్రకటనలో మద్ధతు ప్రకటించారు. టీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మణిపాల్‌రెడ్డి, పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డిలు మల్క కొమురయ్యకు మద్ధతు ప్రకటిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ప్రధానిమోదీ

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

భగత్‌నగర్: భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ గుర్తింపు తీసుకువచ్చారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థులుగా అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీమేయర్‌లు సునీల్ రావు, డి శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, కొలగాని శ్రీనివాస్, బంగారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ ఖయ్యూం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

●**ఆంధ్ర జ్యోతి:** మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

●**తహసీల్దార్:** వాగుల వద్ద ఇసుక అక్రమ రవాణాను అరికట్ట డానికి కందకాలు ఏర్పాటు చేశాం. అక్రమ రవాణా చేస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నాం.

●**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారా?

●**తహసీల్దార్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నాం. విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో పాటు హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

●**ఆంధ్రజ్యోతి:** కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారు?

●**తహసీల్దార్:** కొత్త రేషన్‌కార్డు దారుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం.

●**ఆంధ్రజ్యోతి:** రేషన్ దుకాణాల్లో అక్రమాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

●**తహసీల్దార్:** ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం.

●**ఆంధ్రజ్యోతి:** ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారా?

●**తహసీల్దార్:** ప్రభుత్వం ఆదేశిస్తే లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి వారికి ఉచితంగా ఇసుకను అందజేస్తాం.

-రాయికల్

కరాటేలో ప్రతిభ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జగిత్యాల పట్టణానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్, కరాటే మాస్టర్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో వెళ్లిన ఆరుగురు విద్యార్థులు 12 బంగారు పతకాలతో మెరిశారు. పట్టణంలోని వీర కుంగ్‌ఫూ అకాడమీలో శిక్షణ పొందిన ఆరుగురు విద్యార్థులు బుర్ర మనూప్ గౌడ్, కనిక్ గౌడ్, పాలెపు మన్విత, విశ్వతేజ, మణిదీప్, అన్విత అనే విద్యార్థులు పోటీల్లో పాల్గొని 12 స్వర్ణ పతకాలు సాధించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 12 బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ వెంకటేశ్వర్లును, జగిత్యాల కోర్టు మేనేజ్ మెంట్ కంట్రోల్ ఎస్సై శ్రీకాంత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు రామకృష్ణారావు, మల్లేశంలు అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కోర్టు పీసీలు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



కోరుట్ల సహకార సంఘ భవనం వద్ద బారులు తీరిన రైతులు



బండలింగాపూర్ సహకార సంఘం గోదాం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట పట్టణంలోని సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం మంగళవారం రైతులు బారులు తీరారు. 400 యూరియా బ్యాగులను సోమవారం రాత్రి అధికారులు సహకార సంఘ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. దీంతో రైతులు మంగళవారం ఉదయమే కేంద్రం వద్దకు భారీగా చేరుకున్నారు. కేంద్రం వద్ద హమాలీలను సింగిల్‌విండో సిబ్బంది ఏర్పాటు చేయకపోవడంతో రైతులు యూరియాను వారి వాహనాల వద్దకు తరలించడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చిన స్టాక్ అయిపోగా కొంత మంది రైతులకు యూరియా అందలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరిగారు. మిగిలిన రెండు రోజుల్లో యూరియాను అందిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని ఆయా గ్రామాల్లోని సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. మంగళవారం బండలింగాపూర్ గ్రామంలో సహకార సంఘం గోదాం వద్ద రైతులు యూరియా కోసం నిరీక్షించారు. మంగళవారం గోదాంకు యూరియా లారీ వస్తుందని ఉదయం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కానీ వచ్చిన లారీలో బండలింగాపూర్‌తో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని యామపూర్ సొసైటీలకు అధికారులు పంపించారు. మొదలు యామపూర్‌లో అన్‌లోడు చేసిన తరువాతనే ఇక్కడ వేస్తామని లారీ డ్రైవర్ తెలపడంతో ఆయా గ్రామాల్లోని రైతులు గంటల కొద్ది యూరియా కోసం నిరీక్షించారు. మెట్లచిట్టాపూర్ సొసైటీ వచ్చిన యూరియాను ఎక్కువ శాతం ఆత్మకూర్ గ్రామానికి పంపిణీ చేయడంతో ఇతర గ్రామాల్లోని రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

●**కథలాపూర్:** మండలంలోని సిరికొండ, గంభీర్‌పూర్, భూషణరావుపేట సింగిల్‌విండో గోదాముల్లో యూరియా లభించడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. సొసైటీల అధికారులు యూరియా కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

●**మల్యాల:** మండలంలో యూరియా కొరత నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటలకు మోతాదుకు మించి యూరియా వినియోగిస్తుండడంతోనే సమస్య ఏర్పడుతోందని అధికారులు అంటున్నారు. ఎకరాకు 45కిలోల సంచి అవసరం కాగా అదనంగా వాడుతుండడంతోనే కొరత నెలకొంటున్నట్లు పేర్కొంటున్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

●అవసరం మేరకు సరఫరా

-చంద్రదీపక్, మండల వ్యవసాయ అధికారి, మల్యాల

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అవసరం మేర రైతులకు అందించాం. మరింత యూరియా కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బుధవారం మల్యాల డీసీఎంఎస్ కేంద్రాలకు, పోతారం సహకార సంఘంకు 50టన్నుల యూరియా రానుంది. రైతులు ఆందోళన చెందవద్దు.

గంజాయి పట్టివేత.. ముగ్గురిపై కేసు

ధర్మపురి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన దుర్గం నిశాంత్, కాలువ గంగాధర్, ఎస్‌కే ఆసిఫ్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారివద్ద 829 గ్రాముల గంజాయి ఉన్నట్లు అయన పేర్కొన్నారు. వెంటనే వారి వద్ద నుంచి గంజాయిని, ఒక బైకును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఎవరైనా వ్యక్తులు గంజాయి సరఫరా చేసినా, కలిగి ఉన్నా సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ టీం సభ్యులు

రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో ఎఫ్ఏ మార్కులను తాట్లవాయి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, ఇటిక్యాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్‌లు పదవ తరగతి ఎఫ్ఏ మార్కులు, రికార్డులను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించాలని, ఆ దిశగా విద్యార్థులు కష్టపడి చదివి ధైర్యంతో భయం లేకుండా పరీక్షలు రాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ టీమ్ సభ్యులు చెరుకు మహేశ్వర శర్మ, బొమ్మకంటి రవి కుమార్, వేముగంటి గిరిధర్, మండలోజు రవీందర్, ఆర్‌యూపీపీటీ రాష్ట్ర సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్, గాజెంగి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాజీ జయంతి

ధర్మపురి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు గాజు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చింతామణి చెరువు వద్ద గల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నుంచి సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని అన్ని వీధుల్లో బైక్ ర్యాలీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ శోభాయాత్రలో హిందూ బంధువులు, కాషాయ ప్రేమికులు పాల్గొని హిందూ ఐక్యతను చాటి చెప్పాలని ఆయన అన్నారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాపూర్ గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో పోతరాజులు ప్రత్యేక పూజలను నిర్వహించి వేడుకలను జరిపారు. మహిళలు బోనాలను సమర్పించి వేడుకలలొ పాల్గొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేష్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, సింగిల్ విండో చైర్మెన్‌లు అధిరెడ్డి, భూమయ్య, జగన్‌మోహన్ రావు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి ఊతం

(5వ పేజీ తరువాయి)

సన్న, చిన్నకారు రైతులకు అందుబాటులో ఉండేందుకు ట్రాక్టర్లు, పనిముట్లు కొనుగోలు చేసి అందించారు. జిల్లాలోని పలు మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేయగా పలు ప్రాంతాల్లో ఉపయోగంలోనూ, మరికొన్ని ప్రాంతాల్లో నిరుపయోగంగా మారాయి. కొన్ని మండలాల్లో కొనుగోలు చేసి రెండు, మూడేళ్లు గడిచినా వినియోగించకుండా నిరుపయోగంగా ఉంటున్నాయని తెలుస్తోంది.

ఉపాధి లభిస్తుంది

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. మహిళా సంఘాలకు రాయితీలపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. దీని ద్వారా రైతులకు పిచికారీ యంత్రాలు అందుబాటులో ఉండటమే కాకుండా మహిళలకు ఉపాధి లభించనుంది. మహిళా సభ్యులకు బాధ్యతలు అప్పగించి పర్యవేక్షణ పెంచుతాం.

ఘనంగా మల్లన్న పట్నాలు



ఆత్మకూర్‌లో మల్లన్న పట్నాలు వేస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మల్లికర్జునస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మల్లన్న పట్నం వేడుకలను యాదవులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జాతర ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి చీర, సారెలతో ఒడిబియ్యం పోశారు. అనంతరం ఒగ్గు పూజారులు స్వామి ఇష్టమైన పెద్దపట్నం, మైలపట్నం వేయగా భక్తులు పూజలు చేసి పట్నం తొక్కి అగ్నిగుండం దాటి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యాదవ సంఘం నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి'

కోరుట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్, కండక్టర్, సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించి వివిధ అంశాలను వివరించారు. ఆర్టీసీ ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరే విధంగా డ్రైవర్లు కండక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, హైర్ విత్ డ్రైవర్లు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు అభినందనల వెల్లువ

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అదనపు కలెక్టర్ బీఎస్ లతకు మంగళవారం అభినందనలు వెల్లువలా వచ్చాయి. కొంత కాలంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొనసాగిన గౌతమ్‌రెడ్డిని సంబంధిత బాధ్యతల నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ తొలగించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అదనపు కలెక్టర్ బీఎస్ లతకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన బీఎస్ లతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ హన్మంతరావు, ఎన్నికల విభాగం అధికారి హకీం తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై రైతులకు అవగాహన

కొడిమ్యాల, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం పంటలలో యాంత్రీకరణ ప్రాముఖ్యతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో కూరగాయాల సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఈవోలు రాజేష్, గ్రీష్మ, శ్రీలత, మాజీ సర్పంచు రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా మాతా శిశుసంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచాలని జిల్లా మాతాశిశుసంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పలు ఆరోగ్య అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రసవాలపై గర్భిణీలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

'విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'

కథలాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు జిల్లా రెడ్డి సంఘ జాగృతి అధ్యక్షుడు లవ్‌కుమార్ వినతిపత్రం అందజేశాడు. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఆది శ్రీనివాస్‌కు పదవి ఇవ్వాలని కోరారు.

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి'

ధర్మపురి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా, దొంతాపూర్, ఆరెపల్లి గ్రామాల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దతుగా గ్రాడ్యుయేట్స్, కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంటసుధాకర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు బండలింపూర్ గ్రామ శివారులోని గండి హన్మాన్ ఆలయం వద్ద మంగళవారం పోలీస్, రెవెన్యూ శాఖల చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

మల్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లికి చెందిన చెవులమద్ది స్రవంతి సోమవారం మృతి చెందగా బాధిత కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కూడా పాల్గొని మృతురాలి కొడుకు, కూతురు ఎత్తుకొని కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు

రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మంగళవారం రాయికల్ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, డైరెక్టర్లు కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా సుధాకర్

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ సిహెచ్ మలేషం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా సభ్యులు సంఘం అధ్యక్షులుగా పూదరి సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. డైరెక్టర్‌లుగా చెర్లపల్లి సత్యమ్మ, ఆంగ లక్ష్మీబాయి, ఎనుగందుల శ్రీనివాస్‌గౌడ్, గుండవేణి ప్రణయ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

కొడిమ్యాల, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా, అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎక్సైజ్ సీఐ వై.సర్వేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ మండలంలోని గంగారాంతండా గ్రామంలో నాటుసారా అమ్ముతు పట్టుబడిన బూక్య రామేశం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి కొడిమ్యాల తహసీల్దార్ ఎదుట ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేశామన్నారు. రామేశం బైండోవర్‌ను అతిక్రమిస్తూ మరల గుడుంబా అమ్మడంతో అతడిని తిరిగి కొడిమ్యాల తహసీల్దార్ ఎదుట హాజరుపర్చామన్నారు.తహసీల్దార్ నిందితుడికి 50వేల రూపాయల జరిమానా విధించడంతో మంగళవారం చెల్లించి రసీదును ఎక్సైజ్ కార్యాలయంలో సీఐకి అందించినట్లు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

మల్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి సంబంధించిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను మంగళవారం మల్యాలలో బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. బింగి వేణు,గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, జనగాం రాములు, రవి, గౌతంపాల్గొన్నారు.

'బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాల్లో దావ వసంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉండాలన్నారు. ముఖ్యంగా ఇటిక్యాల గ్రామం బీఆర్ఎస్‌కు ఆయువుపట్టుగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు వెల్మల ప్రతాప్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండపల్కుల రత్నాకర్ రావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఎలగందుల ఉదయశ్రీ, మారంపెల్లి రాణి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు స్పందనసాగర్ రావు, నీరటి శ్రీను, కంటె గంగారాం, పోతవేని రాజేందర్ గౌడ్, మరిపెల్లి నారాయణ గౌడ్, నాయిని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి (యోగ, ఉగ్ర) వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణులు మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, అశ్విన్, అరుణ్, వంశీ, నవీన్ తదితరులు అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు అందంగా అలంకరణ చేసిన స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

కోరుట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంగెం రోడ్డులో గల జంబి గద్దె వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి ఆర్‌వి కర్నన్ పరిశీలించారు. పట్టణ శివారులోని జంబి గద్దె ప్రాంతంలోని సర్వే నంబర్ 923ను పరిశీలించారు. స్థలం వివరాలను ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జగిత్యాల జిల్లాలో నవోదయ పాఠశాల మంజూరి చేయగా అధికారులు పాఠశాల నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్ ఉన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, ముల్క కొమురయ్యలను గెలిపించాలని జగిత్యాల బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి కోరారు. పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలో బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ బద్దం ప్రేం మహేందర్‌రెడ్డి తదితరులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం వంజరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ పాల్గొన్నారు.

●సారంగాపూర్: బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా నాయకులు పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో లయ్యన్న గారి భూమన్న, రెటం జగదీష్, అమలపురం రాజేష్, నలువాల తిరుపతి కంచర్ల నరేష్, గంగారాజం పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందజేత

మల్యాల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కళాశాలలోని 15మంది విద్యార్థినులకు రూ.8వేల చొప్పున ఉపకార వేతనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, మలబార్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.